# సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 13 । జనవరి । 2023






## త్యాగయ్యకు సంగీత నీరాజనం

విశాఖపట్నం: పలువురు సంగీత విద్వాంసులు శ్రవణానందంగా ఆలపించిన కృతులు సంగీతప్రియులను అలౌకికానందంలో ఓలలాడించాయి. త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం ఒకే వేదికపై 200 మంది కళాకారులు త్యాగరాజ స్వామి ఘన రాగ పంచరత్న కృతులను వీనుల విందుగా ఆలపించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో జరుగుతున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో రెండో రోజు ముందుగా త్యాగరాజ స్వామి తిరువీధి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.

## ఆహ్లాదం పంచేలా..

II లో



పర్యాటక శాఖ రంపచోడవరం ప్రాంతంలో వసతులపై దృష్టి పెట్టింది. రూ.కోటితో పార్కు నిర్మిస్తోంది. కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజంలో భాగంగా గిరిజనులకు ఉపాధి కల్పిస్తున్నారు.

## న్యూస్‌రీల్

### నిత్య చైతన్య స్ఫూర్తి స్వామి వివేకానంద



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఎంపీ సత్యవతి, జేసీ కల్పనాకుమారి

అనకాపల్లి టౌన్ : యువత స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దరి వివేకానంద ఫంక్షన్ హాల్లో గురువారం వివేకానంద జయంతి కార్యక్రమాలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. నిత్య చైతన్య స్ఫూర్తి స్వామి వివేకానంద అడుగుజాడల్లో యువత పయనించాలని సూచించారు. జేసీ కల్పనాకుమారి మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవితం యువతకి ఎంతో ఆదర్శమని కొనియాడారు. ఆయన చెప్పిన మాటలు యవతకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. అంతకుముందు విద్యార్థులకు వ్యాస రచన, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి, జేసీ కల్పనాకుమారి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జానకిరామరాజు దంపతులు, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, మాజీ కౌన్సిలర్ దాడి భోగలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్

తుమ్మపాల : ప్రజా పంపిణీ వ్యవస్థ, ధాన్యం కొనుగోలు సంబంధిత సమస్యల పరిష్కారంలో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నెం.1967ను ఈ నెల 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చినట్టు జిల్లా పౌర సరఫరాల అధికారి కేవీఎస్ఎం ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కార్యాలయం నందు ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్(ఐసీసీ) ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పౌర సరఫరాలు, ఒక దేశం ఒక రేషన్ కార్డు, రాష్ట్ర ఆహార కమిషన్, తూనికలు కొలతల శాఖ నంబర్లను 1967కు అనుసంధానం చేస్తూ ఐసీసీను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు పనిచేస్తుందన్నారు. ప్రజలు, వినియోగదారులు ఈ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ప్రజా పంపిణీ వ్యవస్థ, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్, పెట్రోల్ బంకులు, తూనికలు కొలతలు, బియ్యం కార్డు సేవలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.

### ఏయూలో ఉద్యోగ నియామకాల పేరుతో అసత్య ప్రచారం

- తప్పుడు ప్రకటనలు నమ్మొద్దు
- ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో 33 బోధనేతర ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని, దరఖాస్తు చేసుకోవాలంటూ అసత్య ప్రకటనలు సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చాయి. రికార్డ్ అసిస్టెంట్, టైపిస్ట్ తదితర బోధనేతర ఉద్యోగాలు ఏయూలో భర్తీ చేస్తున్నట్టు ఈ ప్రకటనల్లో పేర్కొన్నారు. ఈ ప్రకటనలు ఏయూ అధికారుల దష్టికి రావడంతో వారు అప్రమత్తమయ్యారు. ఆంధ్రాయూనివర్సిటీ రిక్రూట్‌మెంట్ 2023 పేరుతో వెబ్‌సైట్లలో ప్రకటనలు దర్శనమివ్వడంతో ఏయూ అధికారులు వెంటనే స్పందించారు.ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ప్రస్తుతం ఎటువంటి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయలేదని రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న అసత్య ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. నిరుద్యోగ యువత ఈ ప్రకటనలు చూసి మోసపోవద్దని ఆయన హెచ్చరించారు. ఏయూలో ఎటువంటి నియామకాలు జరిపినా విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్ www.andhrauniversity.edu.in లో ఉద్యోగ ప్రకటన వివరాలు ఉంచుతామని చెప్పారు.

### ఏయూతో డిజిఫాక్ ఎంఓయూ

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో డిజిఫాక్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డిజిఫాక్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ పి.అమల్ రాజ్‌లు సంతకాలు చేశారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా డిజిఫాక్ సంస్థ అంకుర సంస్థగా ఏర్పాటైంది. లోకోడ్ టెక్నాలజీ సెంటర్‌గా ఇది ఏయూ, అనుబంధ కళాశాలల విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన ఉపయుక్తంగా శిక్షణ, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, ఇంటర్న్‌షిప్‌లు, ఉపాధి అవకాశాలు వంటివి కల్పిస్తారు. విద్యార్థులకు మేలు చేసే విధంగా ఏయూతో కలసి డిజిఫాక్ సంస్థ పనిచేస్తుంది.

---

సంక్రాంతి అంటే అందరికీ గుర్తుకొచ్చేది పాడిపంటలు.. రంగవల్లికలు.. హరిదాసులు, డూడూ బసవన్నలు.. పిండివంటలు.. వాటితోపాటు కోడిపందేలు కూడా. పెద్ద పండగ వస్తోందంటే చాలు పందెం కోళ్లను సిద్ధం చేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో అది సంప్రదాయంలో ఓ భాగం. సమరోత్సాహానికి చిహ్నం. అయితే ఆ పేరుతో పందేలు, జూదం జరగకుండా పోలీసులు నియంత్రణ చర్యలు తీసుకోవడం పరిపాటి. వారు కఠినంగా ఉండకపోతే పరిస్థితి అదుపు తప్పుతుంది. ఎక్కడైనా పందేలు జరిగితే సమాచారం ఇమ్మని ఈ ఏడాది పోలీసులు వాట్సాప్ నంబర్ కూడా ఏర్పాటు చేశారు.



# కాలు దువ్వుతున్న పందెం కోళ్లు

- తెలుగు సంప్రదాయం అంటున్న నిర్వాహకులు
- జూద స్థావరాలపై పోలీసుల డేగ కన్ను
- సమాచారానికి వాట్సాప్ నంబర్ కేటాయింపు

సాక్షి, అనకాపల్లి: పల్లెలు సంక్రాంతి శోభతో కళకళలాడుతున్నాయి. తమ సత్తా చాటడానికి పందెం కోళ్లు సిద్ధమవుతున్నాయి. **కట్టడి చేయడానికి** పోలీసులు రంగంలోకి ది**గుతున్నా.. తగ్గేదేలే అం**టూ నిర్వాహకులు, గ్రామీ**ణవాసులు ఇప్పటికే రహ**స్యంగా స్థావరాలు ఏర్పాటు **చేసుకున్నారు. పందెం** నిర్వాహకులు సంక్రాంతికి **ఆరు నెలల ముందు నుం**చే కోళ్లకు మంచి పోషకాహా**రం పెట్టి.. శిక్షణ ఇస్తుం**టారు. కోళ్ల **పందేలు తెలుగు** సంప్రదాయం, ఆచారంలో **భాగమని పల్లెవాసుల** మనోగతం. వారి సరదా**ను పందెగాళ్ల సొమ్ము** చేసుకుంటారు. ఈ ఏడా**ది పందెం పుంజుల** విక్రయాలు జోరుగా సా**గాయి. పందెం బరిలో** నిలిచే పుంజు ధర రూ.10 **వేల నుంచి రూ.20 వేల** వరకు పలుకుతుంది. **జీవహింసగా పరిగణించి** పోలీసులు బరులకు అను**మతులు ఇవ్వడంలేదు.** అయినా ప్రతి ఏటా పందేలు జరిగిపోతూనే ఉన్నాయి. దీన్ని తరతరాలుగా వస్తున్న ఆచారంగా చెబుతున్నారు.

**వీటికి భలే గిరాకీ...**

ప్రధానంగా బరిలో దిగే రకాలను పందెంరాయుళ్లు ఎంచుకుంటారు. కాకి, కాకి నెమలి, రసంగి, సేతువ, నెమలి, అబ్రాసు, పండు డేగ, డేగ రకాలకు చెందిన కోళ్లను బరిలోకి దింపుతారు. ఈ పందెం పుంజుల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. జిల్లాలో కేవలం కత్తులు కట్టే పందేలనే నిర్వహిస్తారు. డింకీ పందాలనేవి ఇక్కడ ఉండవు. పందెం కాసేవారికి నమ్మకాలు కూడా ఎక్కువ ఉంటాయి. కొక్కోట శాస్త్రం ప్రకారం ఈ ఏడాది డేగ, కోడికాకి, కోడి నెమలి, సేతువాలకు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రచారం జరగడంతో వాటికి గిరాకీ పెరిగింది. జిల్లాలో వాటి ధర రూ.50 వేల వరకు పలుకుతోంది.

**పందేలు జరిగే ప్రాంతాలు ఇవే...**

జిల్లాలో నర్సీపట్నం నియోజకవర్గంలో నాతవరం, గొలుగొండ, నర్సీపట్నం మండలాలు, పాయకరావుపేట నియోజకవర్గంలో కోటవురట్ల, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాలు, అనకాపల్లి మండలంలో గోపాలపురం, ఆ పరిసర ప్రాంతాలు, చోడవరం నియోజకవర్గంలో రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాలు, మాడుగుల నియోజకవర్గంలో దేవరాపల్లి, మాడుగుల, కె.కోటపాడు, యలమంచిలి నియోజకవర్గం, **పెందుర్తి, సబ్బవరం మండలంలోని పలు ప్రాంతాల్లో కోడిపందేలు జరుగుతుంటాయి. గతంలో గుర్తించిన కోడిపందాల స్థావరాలపై, కేసులో ఉన్న పందెంరాయుళ్ల కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు.**

అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను కూడా రంగంలోకి దింపుతున్నారు. కోడి పందేలు, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు ఎవరి దృష్టికి వచ్చినా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని జిల్లా పోలీసులు కోరుతున్నారు. 9346912724 వాట్సాప్ నంబర్‌కు కూడా ఫొటోలు, సమాచారం పంపాలని, వివరాలు చెప్పిన వారి పేర్లు రహస్యంగా ఉంచుతామని వారు పేర్కొన్నారు.





గొలుగొండలో పెంచుతున్న కోడి పుంజులు

### గెలిస్తే కాసులు.. ఓడితే విందుకు..

మాడుగుల: కోడి పందేలకు గోదావరి జిల్లాలు పెట్టింది పేరు. అక్కడ పోటీలో పాల్గొనేందుకు ఇక్కడి నుంచి కోడి పుంజులను తీసుకువెళతారు. ఖరీదైన బలవర్ధకమైన ఆహారం పెడుతూ ఆరు నెలలపాటు వాటిని పెంచుతారు. చెరువుల్లో ఈత కొట్టించి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. సవలా, సేతువా, నెమలి, తెల్లడేగ లాంటి రకాలు పందెంలో ఎక్కువగా గెలుస్తాయని చెబుతుంటారు. శిక్షణ అందించిన పుంజులను పందెంరాయుళ్లు అధిక ధరలు చెల్లించి కొంటారు. పెద్ద మొత్తాలకు పందేలు కాస్తారు. సంక్రాంతి తీర్థాలలో లక్షలాది రూపాయలు నష్టపోయి భూములు సైతం అమ్ముకున్నవారున్నారు. పందెంలో ఓడిన పుంజు మాంసం రుచికరంగా ఉంటుంది. అందుకే మంచి ధర పలుకుతుంది. గెలిస్తే లాభం .. ఓడితే మంచి విందు.. ఏదైనా పందెం కోడి ప్రత్యేకతే వేరు.

### కోడిపందేలు వద్దు.. సంప్రదాయ క్రీడలే ముద్దు



కోడిపందేల నిర్వహణ చట్టవిరుద్ధం. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు. రేంజ్ పరిధిలో గల అన్ని జిల్లాల్లో సబ్ డివిజన్లకు అడ్డుకట్ట వేసే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాము. 'కోడిపందేలు వద్దు.. సంప్రదాయ క్రీడలే ముద్దు' అంటూ పోలీసు, రెవెన్యూ పంచాయితీ సిబ్బందితో పల్లెల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. కోడిపందేల నిర్వాహకుల మొదలు కత్తులు తయారుచేసే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చాము.

– హరికృష్ణ, విశాఖ రేంజ్ డీఐజీ

### కేజీహెచ్ ఎఫ్ఏసీ సూపరింటెండెంట్‌గా అశోక్‌కుమార్



డాక్టర్ పి.అశోక్‌కుమార్

మహారాణిపేట (విశాఖ దక్షిణ): కేజీహెచ్ ఎఫ్ఏసీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.అశోక్‌కుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా పని చేసిన పి.మైథిలి డిసెంబర్ 31న పదవీ విరమణ చేశారు. గత నెల 31న గుంటూరు మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి గుంటూరులో పనిచేస్తున్న అశోక్‌కుమార్‌ను కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా గురువారం అశోక్‌కుమార్‌ను ఎఫ్ఏసీ(ఫుల్ అడిషనల్ చార్జి) సూపరింటెంటెంట్‌గా నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.ఎస్.నవీన్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

### స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ వేణుగోపాలరావుకు అవార్డు



పశ్చిమ బెంగాల్ గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వేణుగోపాలరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) వి.వి.వేణుగోపాలరావుకు ప్రతిష్టాత్మక ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐకాయ్) అవార్డు లభించింది. ఐకాయ్ ఆధ్వర్యంలో పరిశ్రమ, వ్యాపార రంగాల్లో అసాధారణమైన స్థాయిలో వృత్తిపరమైన విజయాలు సాధించిన వారికి ఏటా ఈ అవార్డులను అందజేస్తారు. ఐకాయ్ ఆధ్వర్యంలో ఈనెల 10న కోల్‌కతాలో నిర్వహించిన కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ డాక్టర్ సి.వి.ఆనంద బోస్ చేతుల మీదుగా వేణుగోపాలరావు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అభినందించారు.

# అంతర్జాతీయ వర్సిటీగా ఏయూ

- స్టార్టప్ రంగంలో సమష్టిగా పనిచేయండి
- ఏయూను సందర్శించిన విదేశీ ప్రతినిధులు



పాలకమండలి సభ్యుడు యేసుపాదంను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి తదితరులు


ఏయూక్యాంపస్: అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయంగా ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దుతున్నట్టు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి తెలిపారు. అమెరికా, స్విట్జర్లాండ్, జర్మనీ దేశాల ప్రతినిధులతో ఏయూ సెనేట్ మందిరంలో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్టార్టప్ రంగంలో ఏయూతో కలసి పని చేయాలని ఆహ్వానించారు. ఇటీవల కాలంలో ఏయూలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులకు విద్యను అందించే కేంద్రంగా ఏయూ నిలుస్తోందని తెలిపారు. విజ్ఞానానికి కేంద్రంగా, ఆవిష్కరణలకు నిలయంగా ఏయూను తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్న విధానాన్ని వివరించారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధిని ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆహ్వానించారు. ఏయూను స్వయంగా సందర్శించి విదేశాలలో ప్రచారం చేయాలని వీసీ సూచించారు. అనంతరం వీరు ఏయూలోని అంతర్జాతీయ విద్యార్థుల వసతిగృహాలను సందర్శించి విద్యార్థులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు.

ఏయూ పాలక మండలి సభ్యుడు పి.ఏసుపాదం మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని అమెరికా, యూరప్ ఖండాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో అనుసంధానం చేసే దిశగా ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల అసోసియేట్ డీన్ ఆచార్య శ్రీనివాస్, చీఫ్ వార్డెన్ సీహెచ్ ఆశా ఇమ్మాన్యుయెల్ రాజు, డాక్టర్ రాజమాణిక్యం, డాక్టర్ కె.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విదేశీ ప్రతినిధులు ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డిని సత్కరించారు. ఏయూ తరపున పాలక మండలి సభ్యులు యేసుపాదంను సత్కరించారు.

### బడి బలోపేతం..!

- నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం
- సబ్జెక్టు టీచర్ల భర్తీకి ప్రాధాన్యం
- అర్హులైన ఎస్జీటీలకు హైస్కూళ్లలో పోస్టింగ్

II లో



# ప్రియురాలి ఆత్మహత్య... ప్రేరేపించిన నేరానికి ఏడేళ్ల జైలు






లెక్కల దేముడు

చోడవరం రూరల్/కె.కోటపాడు: వరుసకు చెల్లి అయినా ప్రేమించాడు.. పెద్దలు వద్దన్నా మాట వినలేదు.. మరొకరితో ఫోన్లో మాట్లాడుతోందని గొడవ పడ్డాడు.. ఆమె ఆత్మహత్యకు కారకుడయ్యాడు.. అంతేకాదు ఆమె మృతదేహాన్ని రహస్యంగా పూడ్చిపెట్టడానికి యత్నించి దొరికిపోయాడు. పోలీసుల దర్యాప్తులో నేరం రుజువు కావడంతో ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు 1500 రూపాయల జరిమానా విధిస్తూ చోడవరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.అరుణశ్రీ తీర్పు చెప్పారు. గురువారం తీర్పు వెలువడిన ఈ కేసు వివరాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేచలపు వెంకటరావు తెలిపారు. నిందితుడు లెక్కల దేముడునాయుడు దేవరాపల్లి మండలం వెంకటరాజుపురం గ్రామానికి చెందినవాడు. అదే గ్రామానికి చెందిన హతురాలు లెక్కల సంధ్య (23) నర్సింగ్ విద్యార్థిని. ఆమెతో నిందితుడు ప్రేమ వ్యవహారం నడపడంతో ఈ విషయం తెలిసిన ఇరువైపుల పెద్దలు వరుసకు అన్నా చెల్లెళ్లయిన ఇద్దరినీ మందలించారు. అయినా నిందితుడు దేముడునాయుడు సంధ్యను ప్రేమ పేరుతో వేధించడం మానలేదన్నది అభియోగం. ఈ నేపథ్యంలో 2018 ఆగస్టు 15 రాత్రి కె.కోటపాడు మండలం ఆర్లె గ్రామంలో ఉన్న నిందితుడి కోళ్ల ఫారమ్ వద్ద సంధ్య శవమై కనిపించింది. ఆమె మృతదేహాన్ని పూడ్చిపెట్టడానికి నిందితుడు గొయ్యిని తవ్వుతుండగా ఆర్లె గ్రామస్తులు, పెద్దలు చూసి నిలదీశారు. తనతో కాకుండా సంధ్య వేరొకరితో ఫోన్లో మాట్లాడుతుందని తెలిసి మందలించానని, ఆమె ఆత్మహత్యకు పాల్పడి చనిపోయిందని, వేరే దారిలేక పూడ్చిపెట్టడానికి గొయ్యి తవ్వుతున్నట్టు ఆర్లె గ్రామస్తులకు తెలిపాడు. తన చెల్లి సంధ్యను నిందితుడు వేధించి, ఆమె మృతికి కారకుడయ్యాడని, పూడ్చిపెట్టాలని చూశాడని హతురాలి అక్క బండారు భవాని కె.కోటపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించాడని ఆరోపించింది. అప్పటి కె.కోటపాడు ఎస్ఐ ఎం.వి.రమణ నిందితుడిపై ఐపీసీ 306, 201 సెక్షన్ల కింద అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించి, సాక్షుల వాంగ్మూలాలను విన్నమీదట నిందితుడిపై మోపిన నేరారోపణలు రుజువు కావడంతో ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు 1500 రూపాయల జరిమానా విధిస్తూ, జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల కారాగార శిక్ష అనుభవించాల్సిందిగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు. తక్షణం నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీలోకి తీసుకున్నారు.

# దస్తావేజులు, స్టాంప్ విక్రేతలపై విజిలెన్స్ దాడులు



చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ సోదాలు



దస్తావేజుల విక్రయ కేంద్రంలో తనిఖీలు

- అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో 11 మందిపై కేసులు

సాక్షి, అనకాపల్లి: దస్తావేజులు, స్టాంప్ పేపర్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత దాడులు జరిపారు. గోపాలపట్నం, అనకాపల్లి, చోడవరం తదితర ప్రాంతాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి నేతృత్వంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, దస్తావేజుల విక్రయ కేంద్రాలలో తనిఖీలు నిర్వహించారు. రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా దస్తావేజుల విడుదల, విక్రయాలను బేరీజు వేశారు. అనకాపల్లి జిల్లాలో పరవాడ, మునగపాక, చోడవరం, సబ్బవరం మండలాలు, విశాఖ జిల్లాలో గోపాలపట్నం, మహారాణిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో విక్రయాలలో అక్రమాలు చోటు చేసుకున్నాయని గుర్తించారు. అధిక ధరలను వసూలు చేస్తున్నట్టు నిర్ధారణ కావడంతో 11మంది విక్రేతలపై కేసులు నమోదు చేశారు. దాడులలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కోటేశ్వరరావు, లక్ష్మోజీ, తిరుపతి రావు, రేవతి, రాము తదితరులు పాల్గొన్నారు.

# స్వామీజీ వివాదాస్పద వ్యాఖ్యలు

- మేలుకొలుపు కార్యక్రమంలో ప్రభుత్వంపై విమర్శలు
- స్వామీజీని అడ్డుకున్న భక్తులు
- స్టేజి పైనుంచి దించేసిన నిర్వాహకులు



శ్రీనివాసానంద భారతిని నిలదీస్తున్న భక్తులు

రావికమతం: టి.అర్జాపురం గ్రామంలో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన భారీ మేలుకొలుపుల సమ్మేళనంలో పాల్గొన్న శ్రీనివాసానంద భారతి (శ్రీకాకుళం) ప్రభుత్వంపై, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో పార్టీలకతీతంగా పలువురు భక్తులు స్వామీజీ ప్రసంగానికి అడ్డు తగిలారు. ఎదురు ప్రశ్నించడంతో నిర్వాహకులు స్వామీజీ వద్దనున్న మైక్ లాగేసుకున్నారు. సభ ముగిసినట్టుగా ప్రకటించడంతో స్వామీజీ స్టేజి నుంచి దిగివెళ్లిపోవాల్సి వచ్చింది.

టి.అర్జాపురం గ్రామంలో మేలుకొలుపుల ముగింపు సభలో ఎత్తున ప్రజలు, మేలుకొలుపు బృందాల సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన శ్రీనివాసానంద భారతి మాట్లాడుతూ 151 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే, ఈ ప్రభుత్వం ఆలయాల నిర్మాణాలకు నిధులివ్వడం లేదని ఆరోపించారు. అంతటితో ఆగకుండా స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో భజన చేస్తున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో అక్కడ ఉన్న భక్తులు స్వామీజీ ప్రసంగానికి ఎదురు తిరిగారు. ప్రజారంజకంగా పాలిస్తున్న నాయకుడిని విమర్శిస్తారా? గత ప్రభుత్వాలతో పోలిస్తే ఈ ప్రభుత్వంలోనే ఆలయాలకు, అర్చకులకు ఎంతో మేలు జరిగిందని నిలదీశారు. రాగద్వేషాలకు అతీతంగా భక్తి తత్వం గురించి మాట్లాడాల్సింది పోయి రాజకీయాలు మాట్లాడుతారా? మీ ప్రసంగం మాకొద్దంటూ గొడవ చేశారు. పార్టీలకతీతంగా ప్రజలంతా ఒక్కటై గొంతు కలపడంతో వివాదం ముదిరేలా ఉందని గమనించిన నిర్వాహకులు స్వామీజీ వద్ద మైక్ లాక్కుని సభ ముగిసిందని ప్రకటించారు. స్వామీజీ బతిమలాడుతున్నా.. అంగీకరించకపోవడంతో స్టేజి దిగి వెళ్లిపోవాల్సి వచ్చింది.

## క్లుప్తంగా

### 2,500 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

• సారాతో ఒకరి అరెస్ట్



జెడ్.జోగింపేటలో పట్టుబడ్డ పులుపుతో కొత్తకోట పోలీసులు

రావికమతం: మండలంలోని దిబ్బి, జెడ్.జోగింపేట గ్రామాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 2,500 లీటర్ల బెల్లం పులుపును రావికమతం, కొత్తకోట ఎస్‌ఐలు ఉమామహేశ్వరరావు, విభీషణరావు తమ సిబ్బందితో కలిసి గురువారం ధ్వంసం చేశారు. రెండు లీటర్ల సారాతో ఒకరిని అరెస్ట్ చేశారు. వారి వివరాల మేరకు.. తమకు ముందస్తు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి ఆయా గ్రామాల్లో దాడి చేశారు. పులుపును ధ్వంసం చేయడమేగాక పాత్రలను దహనం చేశారు. తోటకూరపాలెంలో రెండు లీటర్ల సారా కలిగి ఉన్న సూరెడ్డి రాజుబాబును అరెస్ట్ చేసినట్టు రావికమతం ఎస్‌ఐ తెలిపారు.

### విశ్రాంత ఉపాధ్యాయ సంఘం సహాధ్యక్షుడిగా రాపేట

మాడుగుల రూరల్: ఏపీ విశ్రాంత ఉపాధ్యాయ సంఘం సహాధ్యక్షుడిగా రాపేట రామకొండలరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం తెలిపారు. బుధవారం గుంటూరులో రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యవర్గంలో అనకాపల్లి జిల్లా నుంచి రామకొండలరావు ఎన్నిక కావడంతో విశ్రాంత ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన గతంలో కె.జె.పురం ఎంపీపీ పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు.

### రామసత్యనారాయణకు జాతీయ స్థాయి అవార్డు




అవార్డు స్వీకరిస్తున్న రామసత్యనారాయణ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంకు చెందిన కోరిబిల్లి రామ సత్యనారాయణకు ఇన్నోవేటివ్ లీడర్ ఆఫ్ ది ఇయర్ 2022 అవార్డు దక్కింది. ఎస్ఆర్‌ఎస్‌కే కాలేజీ భీమవరంలో ఫ్యాకల్టీగా ఉన్న రామసత్యనారాయణకు మహారాష్ట్ర ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జాతీయ స్థాయిలో టీ అండ్ పీ ఇన్నోవేటివ్ లీడర్ ఆఫ్ ది ఇయర్ 2022 అవార్డును అందజేసింది. దేశంలో మొత్తం మీద 20 మందికి ఈ అవార్డు రాగా, ఏపీ నుంచి రామసత్యనారాయణకు మాత్రమే దక్కింది. ఈ మేరకు ఎస్ఆర్‌ఎస్‌కే యాజమాన్యం, హరిపాలెం గ్రామస్తులు హర్షం ప్రకటించారు.

పర్యాటకంగా విశేష ఆదరణ పొందిన రంపచోడవరం ప్రాంతంలో సందర్శనీయ ప్రాంతాల్లో వసతులు మెరుగుపడుతున్నాయి. ఈ ప్రాంతానికి వచ్చే సందర్శకులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పర్యాటక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా పర్యాటకులకు అవసరమైన స్థాయిలో వసతుల కల్పనకు చర్యలు చేపట్టింది.



ఐ పోలవరం వద్ద ఏర్పాటు చేసిన గిరిజనుల ప్రతిమలు

# ఆహ్లాదం పంచేలా..

• రంపచోడవరం ప్రాంతంలో వసతులపై దృష్టి పెట్టిన పర్యాటకశాఖ
• రూ. కోటి వ్యయంతో పార్కు నిర్మాణం
• హట్స్‌తోపాటు పిల్లల పార్కు
• సందర్శకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు

రంపచోడవరం: మన్యం అందాలను తిలకించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. వీరికోసం పర్యాటకశాఖ పూర్తిస్థాయిలో వసతులను అందుబాటులోకి తెస్తోంది. దీనిలో భాగంగా రంపచోడవరం, మారేడుమిల్లి ప్రాంతాల్లో పర్యాటకశాఖ అతిథి గృహాలను నిర్మించింది. గతంలో కార్తీకమాసంలో మాత్రమే పర్యాటకుల తాకిడి ఉండేది. ఇప్పుడు సీజన్‌తో సంబంధం లేకుండా పర్యాటకులు ప్రతిరోజు వందల సంఖ్యలో తరలివస్తున్నారు. ఒక వైపు మారేడుమిల్లి ప్రాంతంలోని జలపాతాలు, గుడిసె అందాలు, మరోవైపు గోదావరి పర్యాటకం పాపికొండలు అందాలు ఏజెన్సీ ప్రాంతానికి రారమ్మని పిలుస్తున్నాయి.

• ఏజెన్సీకి పర్యాటకుల తాకిడి పెరగడంతో ఈ రంగం ఆధారపడిన వందల సంఖ్యలో కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.
• రంపచోడవరానికి సమీపంలోని ఐ.పోలవరం వంతెన వద్ద రూ. కోటి వ్యయంతో పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకు రూర్బాన్ నిధులు వెచ్చిస్తున్నారు. అక్కడకు వచ్చే పర్యాటకుల కోసం హట్స్, పార్కు, పిల్లల ఆట వస్తువులు అందుబాటులోకి తీసుకువచ్చారు.
• పార్కులో పచ్చిక బయళ్లతో అందంగా తీర్చిదిద్దడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పనులు చివరి దశకు చేరుకోవడంతో త్వరలో పర్యాటకులకు అందుబాటులోకి రానుంది.
• పార్కు ఆవరణలో గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్మించిన నిర్మించిన ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి
• కొంతకాలంగా నిలిచి పోయిన గుడిసె పర్యాటకం తిరిగి ప్రారంభం కావడంతో ఏజెన్సీకి వచ్చే పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరిగింది.
• కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం(సీబీఈటీ)లో భాగంగా గిరిజనులకు ఉపాధి కల్పిస్తున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీబీఈటీలకు వచ్చిన ఆదాయంలో కొంత గిరిజనులకు ఇస్తున్నారు.
• రంపచోడవరంలో పది సూట్ రూమ్స్, హోటల్‌తో కూడిన పర్యాటక అతిథి గృహం అందుబాటులో ఉంది. మారేడుమిల్లిలో ఉడ్, ఎకో టూరిజం అతిథి గృహాలతో పాటు ప్రైవేట్ అతిథి గృహాలు కూడా అందుబాటులో ఉన్నాయి.



పర్యాటకుల కోసం తీర్చిదిద్దిన పార్కు



గాల్లో తేలేందుకు ఏర్పాటు చేసిన పరికరం

### వారం రోజుల్లో అందుబాటులోకి తెస్తాం

ఐ పోలవరం వద్ద చేపట్టిన పార్కు వారం రోజుల్లో పర్యాటకులకు అందుబాటులోకి వస్తుంది. పర్యాటకులు ఆహ్లాదంగా గడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. మారేడుమిల్లిలో అదనపు కాటేజీలు నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. వాటికి అనుమతులు వస్తే పర్యాటకులకు మరింత వసతి సౌకర్యం మెరుగుపడుతుంది.

–రాజారావు, ఈఈ, పర్యాటక శాఖ, కాకినాడ

## డుడుమ.. ఆకట్టుకునేలా..



డుడుమ జలపాతం వ్యూపాయింట్ వద్ద నిర్మించిన రక్షణ వలయం



డుడుమ మెట్ల మార్గానికి ఏర్పాటుచేసిన రక్షణ

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలోని డుడుమ జలపాతం వద్ద పర్యాటకుల సౌకర్యార్థం వసతులు మెరుగుపడుతున్నాయి. జలపాతం వ్యూపాయింట్, మెట్ల మార్గం, పార్క్ పరిసరాలన రూ.10 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నారు. రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. మెట్ల మార్గంలో రెండు వైపులా, వ్యూపాయింట్ చుట్టూ రక్షణ కంచె నిర్మాణం ఇప్పటికే పూర్తి చేశారు. జలపాతం వద్ద ఉన్న పార్క్‌లో పర్యాటకుల వేచి ఉండేందుకు విభిన్నంగా కేంద్రాలు నిర్మిస్తున్నారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని విస్తరించారు. ఆధునిక హంగులతో అతిథి గృహం నిర్మించారు. ఒడిశా ప్రభుత్వం,ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు ఇందుకు అవసరమైన నిధులు వెచ్చించారు. సౌకర్యాలు మెరుగుపడటంతో పర్యాటకుల్లో ఆనందం నెలకొంది,

## సామాజిక వైద్యుల సేవలు అభినందనీయం




మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణరెడ్డి

• దంత వైద్యుడు కె.ఎస్.ఎన్.రెడ్డి

చోడవరం రూరల్: కోవిడ్ మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో సామాజిక గ్రామీణ వైద్యులే పలువురు ప్రజల ప్రాణాలను కాపాడారని ఆద్య దంత వైద్యశాల డాక్టర్ కె.సత్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం చోడవరంలో అనకాపల్లి జిల్లా గ్రామీణ సామాజిక వైద్యుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దంత వైద్యం విషయమై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కదులుతున్న పళ్లు తొలగించేటప్పుడు పేషెంట్ కేస్ స్టడీ చేయాలన్నారు. డెంటిస్ట్ కె.దీపిక మాట్లాడుతూ రోగి మొదటగా కలిసేది గ్రామీణ వైద్యుడినే అని, ప్రాథమిక వైద్యం ద్వారా నయం కానప్పుడు సంబంధిత వైద్యుడి వద్దకు రోగి వెళ్లే విధంగా చూడాలన్నారు. సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి మాట్లాడుతూ తమ ఉనికిని ప్రభుత్వాలు గుర్తించే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. ఇప్పటి వరకు తమను వ్యతిరేకించే ఐఎంఏ సైతం గ్రామీణ వైద్యుల సేవలకు ఆమోదం తెలుపుతున్నదని, ఇది తమకు శుభ పరిణామమన్నారు. సంఘం అడ్వయిజర్ ముమ్మల తిరుపతిరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ సామాజిక వైద్యుల సంక్షేమం కోసం తగు చర్యలు తీసుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.రాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వీరభద్రరావు, కార్యదర్శి రమణ, కోశాధికారి రమేష్, చోడవరం డివిజన్ అధ్యక్షుడు దొడ్డి అమిత్‌కుమార్, కార్యదర్శి ఆర్.ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు ఏ.కె. మలకర్, కోశాధికారి ఐ.కె.రావు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



సన్యాసిపాత్రుడుకు వివేకానంద చిత్రపటాన్ని బహూకరిస్తున్న సింగర్ ధీరజ్

నర్సీపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1976–79 ఇంటర్మీడియట్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక గురువారం ఉత్సాహంగా జరిగింది. వీరంతా యోగ క్షేమాలు, పూర్వ విద్యార్థుల సంఘం ద్వారా చేపట్టే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు తెలుపుకునేందుకు వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. కేక్ కట్ చేసి నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాడుతా తీయగా సూపర్ సింగర్ ధీరజ్‌ను పూర్వ విద్యార్థులు చింతకాయల సన్యాసిపాత్రుడు, కర్రి రాంగోపాల్ అభినందించారు. ధీరజ్ గీసిన వివేకానంద చిత్రపటాన్ని సన్యాసిపాత్రుడుకు బహూకరించాడు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కుమార్‌బాబు, విశ్రాంత ఎంపీడీవో ప్రేమకర్, విశ్రాంత ఉపాధ్యాయులు సత్యనారాయణ, మీసాల సత్యనారాయణ తదితర్లు పాల్గొన్నారు.

## వైఎస్సార్ టీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను చోడవరం ఎమ్మెల్యే, అనకాపల్లి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగానే ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సానుకూలంగానే ఉందన్నారు. సర్వీసు పరమైన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు వైఎస్సార్ టీఎఫ్ పక్షాన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బాదిరెడ్డి గంగాధర్, ముఖ్య సలహాదారు ఎర్ర జగన్నాథరావు, ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు రొంగలి మంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రాజాధిరాజ వాహనంపై పురుషోత్తముడు

• ఉపమాకలో ఘనంగా తిరువీధి సేవలు
• ముగిసిన రాపత్తు ఉత్సవాలు



రాజాధిరాజ వాహనంలో స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారికి రాజాధిరాజ వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి నిత్యార్చనలు, అభిషేకాలు చేశారు. బాలభోగ నివేదన, రాజభోగ నివేదన, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. అంతకు ముందు పుష్పతోటలో నీరాట్టోత్సవాల్లో భాగంగా గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి ఉభయ దేవేరులతో కూడిన స్వామివారు రాజాధిరాజ వాహనంపైన ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 28వ పాశురాన్ని విన్నపం చేశారు. రాపత్తు అధ్యయనోత్సవాల్లో భాగంగా 11వ రోజు గురువారం సాయంత్రం ఆలయంలో నిత్య కార్యక్రమాలు పూర్తి చేశారు. అనంతరం నమ్మళ్వార్‌లు, భగవత్ రామానుజల వారిని పల్లకిలో అసీనులు చేసి వైష్ణవ స్వాములు మోస్తుండగా, ఆలయంలో అష్టదిక్పాలకుల వద్ద ఇరామానుశనూత్తన్దా సేవా కాలములతో నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ధ్వజస్తంభం వద్ద అధ్యాపక స్వామికి ఆలయ మర్యాద పూర్తి చేసిన తర్వాత ఆళ్వార్లను ఆలయంలోకి తీసుకెళ్లి నిత్య సేవా కాలం నిర్వహించారు. అనంతరం విశేష ప్రసాద నివేదన, తీర్థ గోష్టి కార్యక్రమాలు జరిగాయి. దీంతో పది రోజుల పాటు ఆలయంలో జరిగిన రాపత్తు అధ్యయనోత్సవాలు ముగిసినట్లేనని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో కృష్ణశ్రీకర్




కాకినాడలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకం అందుకుంటున్న గేదెల కృష్ణ శ్రీకర్(బ్లూ టీ షర్ట్)



కత్తిపట్టిన కృష్ణ శ్రీకర్

దేవరాపల్లి: జాతీయ స్థాయి ఫెన్సింగ్(కత్తిసాము) పోటీలకు దేవరాపల్లి మండలం చిననందిపల్లి గ్రామానికి చెందిన గేదెల కృష్ణ శ్రీకర్ అర్హత సాధించాడు. కేరళ రాష్ట్రం కొచ్చిలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 24వ జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడలో సాబర్ విభాగం సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ కోసం పోటీపడుతున్నాడు. నేషనల్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి ప్రారంభమైన ఈ పోటీలు 14 వరకు జరగనున్నాయి. ఈ నెల 5 నుంచి 7 వరకు కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో కృష్ణశ్రీకర్ సత్తా చాటాడు. ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సొంతం చేసుకున్నాడు. దీంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. కృష్ణ శ్రీకర్ ప్రస్తుతం సంగివలసలోని శశి స్కూల్లో 8వ తరగతి చదువుతున్నారు. కృష్ణ శ్రీకర్ తండ్రి జి.నర్సింహమూర్తి కాంట్రాక్టర్ కాగా, తల్లి ఎస్‌బీటీఎస్ దేవి దేవరాపల్లి మండలంలోని కేజీబీవీలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. విశాఖపట్నంకు చెందిన జాతీయ స్థాయి శిక్షకుడైన కిస్టోఫర్ వద్ద కృష్ణశ్రీకర్ గత ఆరు నెలల నుంచి శిక్షణ పొందుతున్నాడు. రోజూ రెండు గంటలపాటు సాధన చేస్తున్నాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా కత్తిసాము క్రీడలో దూసుకుపోతున్న కృష్ణ శ్రీకర్‌ను పలువురు అభినందించారు.

# బడి బలోపేతం..!



కట్టువాని అగ్రహారం పాఠశాలలో నలుగురు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఈ ఫొటో అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం కట్టువాని అగ్రహారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనిది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు నిర్వహిస్తున్న ఇక్కడ ప్రస్తుతం చదువుతున్నది కేవలం ఐదుగురు విద్యార్థులు (ఒకటి, మూడు, ఐదో తరగతిలో ఒక్కొక్కరు, రెండో తరగతిలో ఇద్దరు ఉన్నారు) మాత్రమే. వీరికి పాఠాలు చెప్పేందుకు ఓ ఉపాధ్యాయుడు అందుబాటులో ఉన్నాడు. జాతీయ విద్యావిధానం అమలుతో ఇలాంటి స్కూళ్లు మూసేస్తారని కొంతమంది దుష్ప్రచారం చేశారు. కానీ ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ముందుకెళ్తొన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ఇలాంటి స్కూళ్లను కొనసాగించేందుకే మొగ్గు చూపింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏ ఒక్క స్కూల్ కూడా మూతపడలేదనడానికి ఇదో నిదర్శనంగా నిలుస్తోంది.

• నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం
• సబ్జెక్టు టీచర్ల భర్తీకి ప్రాధాన్యం
• అర్హులైన ఎస్జీటీలకు హైస్కూళ్లలో పోస్టింగ్
• ఏ ఒక్క స్కూల్ మూతపడకుండా జాగ్రత్తలు
• యూపీఎస్‌లలో పెరుగనున్న హెచ్‌ఎం పోస్టులు
• బదిలీల్లో ఇదే రీతిన పోస్టుల కేటాయింపు

విశాఖ విద్య: బడుల బలోపేతమే లక్ష్యంగా విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయుల రేషనలైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు అవసరం/లోటు/మిగులు అనే వాటిని ప్రాధాన్యతగా తీసుకొని కేడర్ వారీగా ఖాళీలను గుర్తించి, జాబితాను సిద్ధం చేశారు. తాజాగా జరిగే బదిలీల్లో ఈ మేరకు ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేశారు.

### 468 మంది సబ్జెక్టు టీచర్ల సర్దుబాటు

విలీన స్కూళ్లలో బోధనకు ఆటంకం లేకుండా స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సర్దుబాటు చేశారు. ఇలా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 468 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో (బయాలాజికల్ సైన్సు – 61, గణితం – 95, ఫిజికల్ సైన్సు – 94, సోషల్ – 34, ఇంగ్లిష్ – 184) అర్హత గల సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)లను నియమించేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు జాబితా సిద్ధం చేశారు. వీరికి నెలకు రూ.2500లు అదనపు ప్రోత్సాహకాన్ని అందజేస్తారు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బదిలీల్లో కూడా ఇదే రీతిన పాఠశాలల్లో పోస్టుల కేటాయింపు చేసిన విద్యాశాఖాధికారులు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 3,877 ఖాళీలను చూపించారు. అర్హత గల వారికి భవిష్యత్‌లో ఉద్యోగోన్నతులు దక్కటంతో పాటు, యూపీఎస్‌ల్లో హెచ్‌ఎం పోస్టులు పెరుగనున్నాయి.

### ఆమోదయోగ్యంగా విలీనం

రేషనలైజేషన్‌లో భాగంగా మొదటి దశలో ఒక కిలోమీటర్ దూరంలోపు విశాఖపట్నంలో 2, అనకాపల్లిలో 14, అల్లూరి జిల్లాలో 1 ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులను 17 యూపీఎస్‌లలో విలీనం చేశారు. అదే విధంగా విశాఖలో 39, అనకాపల్లిలో 193, అల్లూరిలో 18 ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 3,4,5 తరగతుల విద్యార్థులను 250 హైస్కూల్స్‌లో విలీనం చేశారు. ఒక్క స్కూలూ మూతపడకుండా విద్యాశాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.



ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో చంద్రకళ

### ఏ ఒక్క స్కూలూ మూతపడలేదు

విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందించాలనే ఉన్నతాశయంతోనే ప్రభుత్వం పాఠశాలల విలీనానికి శ్రీకారం చుట్టింది. ప్రజాభిప్రాయం మేరకు, ఏ ఒక్క విద్యార్థికీ నష్టం కలుగని రీతిలో మొదటి దశలో విలీన ప్రక్రియ పూర్తి చేశాం. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏ ఒక్క స్కూల్ కూడా మూతపడలేదు. ప్రస్తుతం హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లు అవసరమైన చోట అర్హత గల ఎస్జీటీలను సర్దుబాటు చేస్తున్నాం.

– ఎల్.చంద్రకళ, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

## క్లుప్తంగా

### ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత, జానకిరామరాజు

అనకాపల్లిటౌన్ : ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. స్థానిక చవితినవీధిలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న రహదారులను, డ్రైనేజీని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలపై కృషి చేసిన కార్పొరేటర్ సునీతకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, జీవీఎంసీ ఏఈ సుమిత్ర, పార్టీ నేతలు కూండ్రపు సత్తిబాబు, చింతా రాంజీ, కోన ఉమ పాల్గొన్నారు.

### ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోలీసు గస్తీ



ఆర్టీసీ బస్సుల ప్లాట్‌ఫాం వద్ద పోలీసులు

అనకాపల్లిటౌన్ : పండగల సమయం, ప్రయాణికుల రద్దీ దృష్ట్యా స్థానిక ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) కాంప్లెక్స్ వద్ద పట్టణ పోలీసులు బుధవారం పహారా కాశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఆకతాయిల చేష్టలకు చెక్ పెట్టేలా నిఘా పెంచారు. ఒక్కసారిగా బస్సు ఎక్కేందుకు తోపులాటలకు తావులేకుండా సూచనలు, సలహాలు అందిస్తూ క్రమపద్ధతిలో బస్సుల్లోకి చేరేలా చర్యలు చేపట్టారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎక్స్‌ప్రెస్ డిపో వద్ద ప్రత్యేకంగా పోలీసులను ఆ విభాగం ఏర్పాటు చేసింది.

### కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు

పరవాడ: మండలంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడి పందాలు, పేకాట, గుళ్లాటలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. అదే విధంగా అసాంఘిక నృత్యాలు, రికార్డు డ్యాన్సులు నిర్వహించినా, సహకరించిన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ నిర్వహించినా పరవాడ పోలీస్ స్టేషన్ 9440796038 నంబరుకు సమాచారం అందించాలని సీఐ ఆ ప్రకటనలో కోరారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 7,361 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ | 3,700 | 4,050 |
| మొదటి రకం | 2,860 | 3,400 |
| రెండో రకం | 2,810 | 2,960 |
| మూడో రకం | 2,610 | 2,780 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| ధమాకా | - రాజా |
| వాల్తేరు వీరయ్య | - సత్యనారాయణ స్క్రీన్-1 |
| వీర సింహారెడ్డి | - సత్యనారాయణస్క్రీన్-2 |
| 18 పేజెస్ | - షిర్డిసాయి |
| వాల్తేరు వీరయ్య | - పర్తిసాయి |
| వీర సింహారెడ్డి | - వెంకటేశ్వర |
| లవ్‌టుడే | - శ్రీసత్య |
| వాల్తేరు వీరయ్య | - రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 66 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-16 యూనిట్లు, ఏ నెగిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-39 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 533 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 492 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.



# గ్రోయిన్‌కు బీటలు.. సాగునీటికి ఆటంకాలు



కశింకోట వద్ద శారదానదిపై శిథిలావస్థలో ఉన్న కాశీమదుం గ్రోయిన్



దిగువకు వృథాగా పోతున్న నీరు

- కాశీమదుం గ్రోయిన్ మరమ్మతులకు చర్యలు
- అంచనాల తయారీలో అధికారులు

కశింకోట : కశింకోటలోని శారదానదిపై ఉన్న కాశీమదుం గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో ఈ ఏడాది సాగునీరు అందించాలని భావిస్తున్నారు. ఇందుకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించడానికి ప్రతిపాదనలు తయారు చేయడంలో నీటిపారుదల శాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

కాశీమదుం గ్రోయిన్ పలుచోట్ల దెబ్బతింది. దీనివల్ల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదు. నీరు దిగువకు వృథాగా పోతోంది. దీని కింద సుమారు 1900 ఎకరాల ఆయకట్టు ఉంది. కశింకోట, బయ్యవరం, వెదురుపర్తితోపాటు అచ్యుతాపురం మండలం పెదపాడు గ్రామ ప్రాంతాలకు కూడా గ్రోయిన్ నుంచి కాలువల ద్వారా సాగునీరు అందుతుంది. ఈ ఆయకట్టులో ప్రధానంగా వరి, చెరకు పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. అయితే గ్రోయిన్ మూడేళ్ల క్రితమే కొన్ని చోట్ల పాడయింది. దీంతో తాత్కాలిక మరమ్మతులు చేశారు తప్ప, శాశ్వత మరమ్మతులు లేవు. దీనివల్ల గండ్లు పడి రాళ్లు తేలిపోయి కొన్ని చోట్ల అవి దిగువకు కొంత మేర కొట్టుకుపోయాయి. దీంతో ఆనకట్ట నుంచి నీరు దిగువకు వృథాగా పోయి ఎగువ భాగంలో నీరు నిల్వ ఉండటం లేదు. దీంతో ఆయకట్టు భూములకు కాలువల నుంచి సరిగ్గా సాగు నీరు అందడం లేదు.

ముందు ఉన్న భూములకు తప్ప దిగువన ఉన్న భూములకు సాగునీరు అందక పంటలు సరిగ్గా పండక ఏటా రైతులు నష్టపోతున్నారు. దీని దృష్ట్యా ఆనకట్టకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

### అంచనాలు రూపొందిస్తున్నాం

శారదానదిపై ఈ ఏడాది గ్రోయిన్ల మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు అవసరమైన అంచనాలు తయారు చేస్తున్నాం. దీనిలో భాగంగా కాశీమదుం గ్రోయిన్‌కు కూడా అంచనాలు రూపొందిస్తున్నాం. నిధుల కోసం ప్రభుత్వానికి త్వరలో నివేదిస్తాం. నిధులు మంజూరయ్యాక మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– కె.హనుమంతరావు, ఏఈ, నీటిపారుదల శాఖ, అనకాపల్లి

# పట్టణానికి పండగ శోభ



కిటకిటలాడుతున్న వస్త్ర దుకాణం



బంగారం షాపులో కొనుగోలుదారుల సందడి



కశింకోట సంతలో జోరుగా వస్త్రాల కొనుగోళ్లు

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని దుకాణాల్లో పండగ శోభ మొదలయింది. విద్యా సంస్థలకు సెలవులు కావడంతో సకుటుంబంగా షాపింగ్‌కు వచ్చేవారితో కళకళలాడాయి. వస్త్ర దుకాణాలు కొనుగోలుదార్లతో కిట కిటలాడాయి. కొన్ని దుకాణాలు పండగ ఆఫర్లతో కిక్కిరిశాయి. సరికొత్త డిజైన్లు, మోడళ్లతో కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు దుకాణదారులు లక్కీడ్రా, డిస్కౌంట్ ఆఫర్లను ప్రకటించడం, పండగకు మరో రెండు రోజులే గడువుండటంతో వ్యాపార సముదాయాలు బిజీగా మారాయి. బంగారం దుకాణాలు కూడా కొనుగోలుదార్లతో కళకళలాడాయి. గతేడాదితో పోల్చుకుంటే ఈసారి వ్యాపారాలు బాగున్నట్టు పలువురు వస్త్ర దుకాణదారులు చెబుతున్నారు.

### కిక్కిరిసిన వారపు సంత

కశింకోట : కశింకోట వారపుసంతకు రెండు రోజుల ముందే సంక్రాంతి కళ వచ్చింది. గురువారం అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి కూరగాయలు, సుంగధ ద్రవ్యాలు, వస్త్రాలు తదితర పండగ సామాగ్రి కొనుగోలు చేశారు. సంత కొనుగోలుదారులతో కిటకిటలాడింది. సంక్రాంతి సంప్రదాయంగా పెద్దలకు పెట్టే సంప్రదాయ వస్త్రాల కొనుగోళ్లు ఎక్కువగా జరిగాయి. సంక్రాంతికి కలగూర వండి పెద్దలకు నివేదించేందుకు అవసరమైన సరకుల్ని కొనుక్కున్నారు. వాటిలో వినియోగించే గుమ్మడి, వంకాయ, చిలగడ దుంప, అరటికాయ, చిక్కుడు, పెండ్లం తదితర కూరగాయల ధరలు కాస్త పెరిగాయి. అలాగే టమాటా గత వారం కిలో రూ.15 ఉండగా ఈ వారం రూ.20కి, బంగాళదుంప రూ.20 నుంచి రూ.30, బెండ రూ.60 నుంచి రూ.80, గుమ్మడికాయ(చిన్నసైజు) రూ.40 నుంచి రూ.80, వంకాయ రూ.40 నుంచి రూ.60కి పెరిగాయి. ఉల్లిపాయ రూ.25, క్యారెట్, దొండ రూ.60, క్యాప్సికం, చిక్కుడు రూ.80కి విక్రయాలు సాగాయి.

# శరవేగంగా సచివాలయ నిర్మాణం



సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

అనకాపల్లి రూరల్ : మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో జరుగుతున్న సచివాలయ భవన నిర్మాణ పనులను గురువారం పలువురు నాయకులు పరిశీలించారు. సచివాలయం-2 శ్లాబ్, కాంక్రీట్ పనులను సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, చంద్రశేఖర్ ప్రారంభించారు. త్వరితగతిన భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా ముమ్మరంగా పనులు సాగుతున్నాయి. నాణ్యతలో రాజీపడకుండా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఇందులో ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, సత్యారావు, చిన్న, రాజ్‌కుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో మరణం కలచివేసింది



సంతాప సభలో దివంగత ఎంపీడీవోకు నివాళి అర్పిస్తున్న ఎంపీపీ, స్థానిక నాయకులు

అనకాపల్లి రూరల్: అనకాపల్లి ఎంపీడీవో డి.చంద్రశేఖర్ మృతి పట్ల అనకాపల్లి మండల ప్రజాపరిషత్ గురువారం ఘన నివాళి అర్పించింది. ఎంపీపీ గొర్లి సూరిబాబు ఎంపీడీవో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రశేఖర్ మరణం కలచివేసిందన్నారు. ఆయన చేసిన సేవలను పలువురు ప్రశంసించారు. సభలో వైఎస్సార్ సీపీ నాయకుడు భీశెట్టి జగన్, తహసీల్దార్ గంగాధర్‌రావు, ఈవోఆర్డీ ధర్మారావు, వైస్ ఎంపీపీలు అయిత రాము, విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# సంపద కేంద్రానికి భూమిపూజ

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మూలపేటలో ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించనున్న సంపద తయారీ కేంద్రానికి ఆమె గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే ఈ కేంద్రాల ద్వారా ఎరువులు అందుబాటులోకి వస్తాయన్నారు. సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొడ్డేడ చెల్లయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు



వివేకానందుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హిమశేఖర్ కళాశాల కరెస్పాండెంట్ జనార్దన్



వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ యువమోర్చానేతలు

**లెండి.. మేల్కొనండి.. గమ్యం చేరేవరకు విశ్రమించకండి.. అంటూ యువతలో ఉత్తేజాన్ని నింపిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద. భారత దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన చైతన్య దీప్తి స్వామి వివేకానంద. ఆయన జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఊరూరా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు వివేకానందుని జయంతిని ఘనంగా నిర్వహించాయి.**



విద్యార్థికి బహుమతి అందిస్తున్న డీఎస్పీ సునీల్

- ఊరూవాడా ఘనంగా వివేకానంద జయంతి

అనకాపల్లిటౌన్ : భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. వివేకానందుని జయంతి సందర్భంగా గాంధీనగరంలో గురువారం వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ నేతలు బుద్ద భాస్కర్, పాము సన్నిబాబు, యాదగిరి గోవింద్, బండి ఆనంద్, ఉగ్గిన అప్పారావు, గంటా సముద్రాలు పాల్గొన్నారు.

- స్థానిక సిటీ పబ్లిక్ స్కూల్ వద్ద వివేకానందుని జయంతి వేడుకల్లో భాగంగా వివేకానందుని చిత్రపటానికి బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు గేదెల స్వరూప్ పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా స్థానిక రింగ్ రోడ్డు నుంచి సిటీపబ్లిక్ స్కూల్ వరకు 2 కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పార్టీ నాయకులు వుడా రమేష్, కొండబాబు, మారిశెట్టి భాస్కర్, నర్సింగ్‌యాదవ్, మురళి పాల్గొన్నారు.
- స్థానిక సుబ్రహ్మణ్యం ఏసీ కల్యాణమండపంలో హిమశేఖర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కరస్పాండెంట్ కె.జనార్దన్ వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : స్వామి వివేకానందుడి ఆశయాలను యువతరం ఆదర్శప్రాయంగా తీసుకోవాలని డీఎస్పీ సునీల్ అన్నారు. స్థానిక వివేకానంద స్కూల్లో గురువారం స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ సంస్కృతీ, సంప్రదాయాలను విదేశాల్లో ప్రచారం చేసి, దేశ గౌరవాన్ని ఇనుమడింప చేశారని కొనియాడారు. సీఐ రవికుమార్, ఎస్ఐ ఆదినారాయణరెడ్డి, ఎంపీడీవో కొంకి అప్పారావు, కరస్పాండెంట్ మళ్ల జగదీష్, ప్రిన్సిపాళ్లు శైలజ, తిరుపతిరావు, వేదుల వెంకటశాస్త్రి పాల్గొన్నారు.

- స్థానిక వివేకానంద విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో జయంతి సందర్భంగా ఇక్కడి ఎస్‌బీఐ వద్ద ఉన్న వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ గౌరవాధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



ప్రథమస్థానంలో నిలిచిన డూడూ బసవన్న సంక్రాంతి పాటలో విద్యార్థులు



ద్వితీయ బహుమతి పొందిన అందాలలో మహోదయం రూపకంలో కంప్యూటర్ విద్యార్థులు



తృతీయస్థానంలో నిలిచిన జై హనుమాన్ గీతం ప్రదర్శనలో బయోటెక్ విద్యార్థులు

- పలు విద్యాసంస్థల్లో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో గురువారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. స్థానిక కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణమండపంలో హిమశేఖర్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పలు విభాగాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు ప్రకటించారు. బీకాం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రదర్శించిన సంక్రాంతి పాటకు ప్రథమ బహుమతి, డిగ్రీ కంప్యూటర్స్ ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థులు ప్రదర్శించిన అభినయ రూపకానికి ద్వితీయ బహుమతి, ద్వితీయ సంవత్సరం(స్టేట్) బయోటెక్ విద్యార్థులు జై హనుమాన్ ప్రదర్శనకు తృతీయ బహుమతి లభించాయి. కళాశాల కరస్పాండెంట్ కొణతాల జనార్దన్ చేతుల మీదుగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రమేష్, డైరెక్టర్ ఉషానందిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. డైట్ కళాశాలలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ భోగిమంట వెలిగించి సందడి చేశారు. అంతకుముందు విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో చేసిన భోగిమంట చుట్టూ కోలాటం, గంగిరెద్దు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ చల్లా నరసింహం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. దాడి వీరునాయుడు కళాశాలలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.దయామాధురి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న గాయత్రీ స్కూల్లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు భోగిమంట వేసి కోలాటాలు ప్రదర్శించారు. విద్యార్థులు హరిదాసు, డూడూ బసవన్న వేషధారణలో అలరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



డైట్ కళాశాలలో భోగిమంట వెలిగిస్తున్న కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్



సంప్రదాయ వస్త్రధారణలో తాళ్లపాలెం గాయత్రీ స్కూల్ విద్యార్థులు



భోగిమంట చుట్టూ సంక్రాంతి పాట పాడుతూ కోలాటం చేస్తున్న బాలికలు

# శివయ్య సేవలు స్మరణీయం



సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

అనకాపల్లిటౌన్ : ప్రముఖ న్యాయవాది, దివంగత శివయ్య మరణించినా మన హృదయాల్లో చిరంజీవిగా బతికే ఉంటారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, సీనియర్ న్యాయవాది స్టాలిన్‌లు అన్నారు. శివయ్య సంస్మరణ సభ స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బలహీనవర్గాలకు ఉచిత న్యాయసేవలందించిన వ్యక్తి శివయ్య అని కొనియాడారు. ఇండియన్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు భగవతి, న్యాయవాదులు హర శ్రీనివాసరావు, బాబు, సుధాకర్, సీపీఐ నేతలు పాల్గొన్నారు.

# వివాదాస్పద స్థల పరిశీలన



వివాదాస్పదంగా మారిన కాలువ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్ అండ్ బీ ఏఈ లలిత

పరవాడ: మండలంలో పి.బోనంగి గ్రామంలో వివాదస్పదంగా మారిన సీసీ కాలువను రోడ్డు భవనాల శాఖ ఏఈ లలిత గురువారం పరిశీలించారు. ఇక్కడ పంచాయతీ నిధులు రూ.8 లక్షలతో చేపట్టిన సీసీ కాలువ నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. కాలువ నిర్మాణం జరుపుతున్న స్థలం రోడ్లు-భవనాల శాఖకు చెందినదని.. సదరు స్థలంలో అభివృద్ధి పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ బండారు కల్పనరాజశేఖర్ ఆర్ అండ్ బీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుతో ఏఈ లలిత స్థానిక రెవెన్యూ అధికారులతో వివాదాస్పదంగా మారిన స్థలాన్ని పరిశీలించారు. ఆర్ అండ్ బీ మ్యాప్ సాయంతో సదరు స్థలం తమదో.. కాదో నిర్ధారిస్తామని చెప్పారు. అనంతరం జాజులవానిపాలెం-పి.బోనంగి రహదారిలో శిథిలావస్థకు చేరిన కల్వర్టును పరిశీలించారు. మరమ్మతులకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఆమె వెంట గ్రామ సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి నాగమణి, వీఆర్వో సత్యనారాయణ, స్థానిక నాయకులు ఉన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్టు

సబ్బవరం: మండలంలోని అజనగిరి శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ రంగనాథం తెలిపారు. వారి వద్ద నుండి రూ.660 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో షేక్ రెహమాన్ (60), బొడ్డేపల్లి తాతబాబు (47), యర్రా సింహాద్రి (45), ఇందల సత్యారావు (49)పై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

# మెరుగైన పనితనం కనబరచాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్‌నాయుడు

సబ్బవరం: అర్హులందరికీ క్షేత్రస్థాయిలో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందే విధంగా పంచాయితీ కార్యదర్శులు పని చేయాలని ఎంపీడీవో రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయితీ సర్పంచ్‌లు, కార్యదర్శులతో సంక్షేమ పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అందలేదన్న సమాచారం ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పింఛన్ల తొలగింపుపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ అర్హత ఉంటే నివేదికలు అందించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ఎస్ బాబురావు, ఈవోపీఆర్డీ మహేష్‌తో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.